



తైక్వాండో పోటీలలో విహాస్‌కు బ్రాంజ్ మెడల్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఒడిస్సా, కటక్ జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో క్యెరోగి పుంసే నాలుగవ సబ్ జూనియర్, సీనియర్ నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలలో తిరుపతికి చెందిన రాగి పాలెం విహాస్ బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. విహాస్ తైక్వాండో క్యెరోగి పుంసే సబ్ జూనియర్ అండర్- 38 కిలోల బాలుర విభాగంలో అత్యధిక పాయింట్లతో విజేతగా నిలిచారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాల నుంచి మొట్టమొదటిసారిగా జాతీయస్థాయి తైక్వాండో పుంసే సబ్ జూనియర్ పోటీలకు విహాస్ హాజరై తొలి కాంస్య పతకాన్ని సాధించారు. రాయలసీమ జిల్లాలలోని తైక్వాండో క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారు. తన కోచ్‌లు, మేనేజర్లు గోవర్ధన్, పవన్ కుమార్, సాయిరాం, రోహిత్‌లకు విహాస్ ధన్యవాదాలు తెలిపారు. బ్రాంజ్ విహాస్‌ను ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, వెంకటేశ్వర్లు అభినందించారు.

పోలీసుల వైఫల్యం.. చెలరేగుతున్న గంజాయి, రౌడీ బ్యాచ్‌లు

- 13న గంజాయి, రౌడీయిజాలకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ
- రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల ఘాటు విమర్శలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో పవిత్రతకు భంగం వాటిల్లకుండా అధికార పార్టీ నాయకులు, పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని వామపక్ష పార్టీ నేతలు కోరారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో తిరుపతి బైరాగి పట్టెడలోనే సిపిఐ కార్యాలయంలో పి.వెంకటరత్నం, వేణుగోపాల్, హరీష్‌ల అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం జిల్లా వందవాసి నాగరాజు, సిపిఐ ఎమ్ ఎల్ న్యూ డెమోక్రసి జిల్లా కార్యదర్శి రాపినేని హరిక్రిష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ తిరుపతి నగరమే కాక, జిల్లా మొత్తం మీద భూకబ్జాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ఆరోపించారు. ఎవరు అధికారంలో ఉంటే వారి కనుసన్నల్లో ఈ వ్యవహారం నడుస్తోందన్నారు. రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ బాధితులను నిలువునా మోసం చేస్తున్నారని విమర్శించారు. తిరుపతి, గాంధీ పురంలో విశ్రాంత ప్రొఫెసర్ సరోజినీ దేవి స్థలంలో బాడుకు ఇచ్చిన పాపానికి వాడుకదారులు రెంట్ కట్టకుండా స్థలాన్ని కబ్జా చేసుకుని షెడ్ వేసుకున్నారనతి తెలిపారు. అందుకు ఎంఆర్ పల్లి సీఐ దగ్గరుండి దౌర్జన్యకారులకు, రౌడీలకు వత్తాసు పలకడం దారుణమన్నారు. ఏర్పేడు మండలంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమి పట్టాలను, ఒక అగ్రకుల వ్యక్తికి పాస్ బుక్కులు మంజూరు చేయడం జరిగిందన్నారు. రేణిగుంట మండలం, అన్నాసంపల్లి వద్ద మునిరెడ్డి ప్లాట్లు వేసి, కోట్లాది రూపాయలకు అమ్ముకుంటున్నా, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎవరైనా ప్రశ్నిస్తే పోలీసులు వారిపై అక్రమ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు. గంజాయి లాంటి వాటి వల్ల తిరుపతిలో శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయని, వీటిని సరి చేయడానికి తిరుపతి ప్రజలందరినీ చైతన్య పరచాల్సిన అవసరం ఉందని సూచించారు. పెట్టుబడిదారులు ఆధ్యాత్మికతను అడ్డం పెట్టుకొని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చైనాలో సోషల్ క్రెడిట్ సిస్టం ఉందని, ప్రతి మనిషి రేటింగ్‌ను బట్టి అతని క్యారెక్టర్‌ను అంచనా వేసి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. అలాంటి విధానం మన దేశంలో కూడా రావాలన్నారు. పోలీసుల అండతోనే వేణుగోపాల కాలనీలో జెసిబిలతో రెండు గంటల్లో కాలనీ మొత్తాన్ని ధ్వంసం చేసినా ఎస్పీ స్పందించకపోవడం, కలెక్టర్ నిర్లక్ష్యంగా ఉండడం చూస్తుంటే పాలనా వైఫల్యాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు మాట్లాడుతూ తిరుపతి నగరంలో రౌడీలు, గుండాలను లేకుండా చేసిన చరిత్ర ఎర్రజెండాకే ఉందని ఒకప్పుడు రౌడీలు.. వీధి రౌడీలుగా ఉండే వారిని నేడు పోలీసుల అండతో రాజకీయ రౌడీలుగా మారిపోయి సెటిల్మెంట్ గ్యాంగ్ తయారయ్యారని విమర్శించారు. భూకబ్జాలు చేస్తూ షెడ్లు వేసి కోట్ల రూపాయలకు అమ్ముకుంటూ, అడ్డొచ్చిన వారిపై దాడులు చేస్తూ గంజాయి మత్తులో తిరుపతి నగరం తూగుతున్నదని ఎద్దేవా చేశారు. విశ్రాంత జడ్జి గుర్రప్ప నాయుడు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు భూ సమస్యల పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెంది, రాజకీయ అండదండలతో అవినీతికి పాల్పడుతూ



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత వందవాశి నాగరాజు

రెవెన్యూ సమస్యల్ని జటిలం చేస్తున్నారన్నారు. మఠం, టీటీడీ భూముల ఫేక్ డాక్యుమెంట్లు తయారు చేసుకొని అమ్ముకుంటున్నా, అధికారులు చూస్తూ ఉండడం, అందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు అండదండలు అందించడం, ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా అంజయ్య, రిటైర్డ్ జేడీ విజయకుమార్‌లు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో కానీ, రెవెన్యూ కార్యాలయంలో కానీ సమస్యను పరిష్కరిస్తే మాకెంత అంటూ పోలీసులు దిగజారి అడగడం, ఫ్లాట్ ఫారాల మీద, తోపుడు బండ్లు, గంపల్లో పండ్ల వ్యాపారం చేసుకునే వారి వద్ద దందా వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆటో, ఫైనాన్స్ వారి ఆగడాలు మితిమీరిపోయాయని వాటిని కూడా నిలువరించడంలో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు లోకేష్, సిపిఐ నగర కార్యదర్శి జె విశ్వనాథ్ 13 తేదీన ఒక ర్యాలీ నిర్వహించి, తిరుపతి పవిత్రతను, ప్రశాంతతను, శాంతి, భద్రతలను కాపాడాలని కోరుతూ కార్యక్రమం నిర్వహించాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదం పొందారు. పౌర చైతన్య వేదిక జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్ లాయర్స్ అసోసియేషన్ నాయకులు చల్లా వెంకటయ్య ఏఐఎంఎస్ నాయకురాలు లక్ష్మి, డీఎంసీ భాస్కర్, ధన శేఖర్ తదితరులు మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారిలో మార్పు తీసుకురావడానికి పోరాటాన్ని రూపకల్పన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, నగర నాయకులు బండి చలపతి, ఎన్ డి రవి, కే పద్మనాభరెడ్డి, ఎం రామకృష్ణ, ఎన్ శివ, కే వై రాజా, చిన్నం కాలయ్య, మహేంద్ర, జె నాగరాజు, రత్నమ్మ , విజయ, సిపిఎం నాయకులు బుజ్జి, సిపిఐ ఎమ్మెల్యే డెమోక్రసీ నాయకులు కుడుముల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా హోటల్ టెండర్లు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో ఇటీవల జరిపిన బిగ్ అండ్ జనతా క్యాంటీన్ల టెండర్ ప్రక్రియ గతంలో ఎన్నడూ లేని విధంగా చాలా పారదర్శకంగా జరిగిందని టిటిడీ ఛైర్మన్ తెలిపారు. బుధవారం అన్నమయ్య భవనంలో టిటిడి ఈఓ, అదనపు ఈఓ లతో కలసి ఛైర్మన్ బి.ఆర్ నాయుడు పలు అంశాలను మీడియాకు వివరించారు. టెండర్ల పై కొందరు పనిగట్టుకొని చేస్తున్న ఆరోపణలు గురించి టీటీడీ పట్టించుకోదన్నారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల ఆహార అవసరాలను తీర్చే ఉద్దేశంతో ప్రణాళికా బద్ధంగా క్యాంటీన్ల టెండర్లు పిలిచామన్నారు. భక్తులకు మరింత రుచికరమైన, నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలనేదే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. దేశంలోని ప్రముఖ ఆహార పదార్థల తయారీ సంస్థలు టెండర్లో పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో టెండర్లను ఆహ్వానించడం ద్వారా బిగ్ క్యాంటీన్లను కేటాయించడం జరిగిందన్నారు. జనతా క్యాంటీన్‌లకు లైసెన్స్ రుసుము నిర్ణయించి, లాటరీ డ్రా (డిప్ పద్ధతిలో) కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి క్యాంటీన్‌కు లైసెన్స్ రుసుమును ముందుగానే నిర్ణయించడం ద్వారా ఒక కొత్త విధానాన్ని రూపొందించినట్లు తెలిపారు. మొదటి విడతగా ఖాళీగా ఉన్న 10 క్యాంటీన్లకు (5 బిగ్ అండ్ 5 జనతా) 2025 జూన్ 14వ తేదీన నోటిఫికేషన్ ఇచ్చి, సీల్డ్ ఈఓఐ దరఖాస్తులను టీటీడీ ఆహ్వానించిందన్నారు. టీటీడీ నిబంధనల మేరకు దరఖాస్తులను పరిశీలించి కేటాయించామని తెలిపారు.

భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు : టిటిడి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను మాయమాటలతో మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టిటిడి హెచ్చరించింది. గత వారం రోజుల క్రితం భక్తురాలు ఊర్వశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గూగుల్ ద్వారా వసతి కోసం వెతికే క్రమంలో శ్రీనివాసం రెస్ట్ హౌస్ అనే వెబ్ సైట్‌లో ఇచ్చిన మొబైల్ నెంబర్ 8062180322 ను సంప్రదించగా, అభిమన్యు అనే వ్యక్తి తాను శ్రీనివాసం కాంప్లెక్స్‌లో రిసెప్షన్‌కి చెందిన వాడినని తప్పుడు సమాచారంతో పరిచయం చేసుకున్నాడు. సదరు భక్తురాలికి వసతి కల్పిస్తామని నమ్మబలికి కొంత మొత్తాన్ని వసూలు చేశాడు. డబ్బు చెల్లిస్తే వసతి టికెట్‌ను పిడిఎఫ్ పంపిస్తామని హామీ ఇచ్చాడు. డబ్బు తీసుకున్న తర్వాత సదరు నిందితుడు తన ఫోన్ కాల్స్, వాట్సాప్ మేసేజ్‌లకు స్పందించకుండా మోసం చేశాడు. దీంతో నకిలీ వెబ్ సైట్ ద్వారా మోసపోయానని గ్రహించిన సదరు భక్తురాలు 1930 క్రైమ్ హెల్ప్ లైన్ కు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల టిటిడి సేవల పేరుతో నకిలీ వెబ్ సైట్లు ద్వారా భక్తులను మోసం చేస్తున్న ఘటనలు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి సూచించింది. భక్తులను అనుమాస్పద వ్యక్తులు, దళారులు ప్రలోభ పెడితే ముందుగా టిటిడి విజిలెన్స్ విభాగానికి చెందిన సదరు నెంబర్ కు 0877 – 2263828 ఫోన్ చేసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని టిటిడి సూచించింది. నకిలీ దర్శన టికెట్లు, వసతి పేరుతో దందా చేస్తే వెంటనే సదరు మోసపూరిత వ్యక్తులు, దళారుల వివరాలను ఫోన్ చేసి టిటిడి విజిలెన్స్ దృష్టికి తీసుకురావాలని టిటిడి కోరింది. శ్రీవారి దర్శనం, వసతి కోసం టిటిడి అధికారిక వెబ్సైట్ ద్వారా మాత్రమే ఆన్ లైన్‌లో తమ ఆధార్ కార్డ్ ఆధారంగా టికెట్లు బుక్ చేసుకోవాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని భక్తులకు సూచించింది. ఇతర వివరాలకు టిటిడి టోల్ ఫ్రీ నెంబర్ 155257 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని టిటిడి కోరింది.

అధ్వానంగా 'వెల్ఫేర్ హాస్టల్'

విద్య ఒక ప్రాథమిక హక్కు.. ప్రతి ఒక్కరికి కనీస అవసరాల్లో విద్య అనేది ఒక భాగం. చాలామంది తల్లిదండ్రులు వారి పిల్లలను ఇంటిదగ్గర చదివించలేక కనీసం తినడానికి అన్నం పెట్టలేక ప్రభుత్వ హాస్టల్లో ఉంచి చదివిస్తారు. వారి బ్రతుకులు అధ్వానంగా ఉన్న తమ బిడ్డలనైనా చదివిస్తే వారి బ్రతుకులు మారతాయని కలలు కంటూ.. ప్రభుత్వ హాస్టల్ వైపు ఆలోచిస్తుంటారు. కానీ తీరా చూస్తే హాస్టల్లో మౌలిక వసతులకు కరువయ్యి.. తినడానికి తిండి సక్రమంగా లేక తిరిగి ఇంటి బాట పట్టడం గమనార్హం! (ప్రజాశక్తి - ఏర్పేడు)

120 మంది విద్యార్థులు చదువుతున్న పల్లం సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర వసతి గృహంలో అనేక సమస్యలతో నిత్యం విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను తెలుసుకున్న ఏర్పేడు సిపిఎం నాయకులు రంగయ్య, నాగరాజు, భాస్కర్ రెడ్డి, వెంకటాద్రి బుధవారం ఉదయం విద్యార్థుల భోజన సమయంలో హాస్టల్లో సందర్శించారు. ఈ నేపథ్యంలో హాస్టల్లో విద్యార్థులకు మౌలిక వసతుల గురించి ఆరా తీయగా.. అనేక సమస్యలతో విద్యార్థులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా తెలపడం జరిగింది.

వాచ్మెన్ నుండి వంట మనిషి దాకా అతనే..!



కొన్ని నెలల క్రితం వంట మనిషిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి మానేయడంతో ప్రత్యామ్నాయ వంట మనిషిని నియమించలేదు. దీంతో వాచ్మెన్ గా పనిచేస్తున్న వ్యక్తి వంట మనిషిగా మారాడు. కామటి లేక విద్యార్థులే భోజనం వడ్డించుకునే పరిస్థితి. కనీసం హౌస్ కీపర్ కూడా లేకపోవడంతో చెత్తాచెదారంతో విద్యార్థుల గదులు నిండిపోయి.. శుభ్రం చేయలేని పరిస్థితుల్లో విద్యార్థులకు తంటాలు.

నీటి సౌకర్యం లేని టాయిలెట్లు..



టాయిలెట్లు ఉన్నప్పటికీ నీటి సౌకర్యం లేక అపరశుభ్రంగా ఉండే పరిస్థితి. టాయిలెట్ లోని కుళాయిలు, పైపులు మరమ్మతులకు గురికావడం ఇంతవరకు వాటిని పట్టించుకునే నాధుడే లేడు. దీంతో విద్యార్థులు అప్పుడప్పుడు ఆరుబయటే మల విసర్జనకు వెళ్లే పరిస్థితి. ఆరు బయటే స్నానాలు.. ఉండేది ఒకే కొళాయి ఇక్కడే బట్టలు ఉతకడం స్నానాలు చేయడం జరుగుతుంది. ఇది కూడా పాచి పట్టి అపరశుభ్రంగా ఉన్న దుస్థితి. బాత్రూం వెలుపల ప్రదేశంలో భారీ గుంత తవ్వారు.. ఇటీవల వర్షాలు రావడంతో నీటితో నిండి విద్యార్థులకు పెనుముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

అధ్వానంగా ఆర్ఓ ప్లాంట్..

విద్యార్థులకు ఆరోగ్య దృష్ట్యా మంచి త్రాగునీటి సౌకర్యం అవసరం కానీ ఆర్వో ప్లాంట్ ఉన్నా.. దాన్ని శుభ్రపరిచే పరిస్థితి లేదు. దీంతో ఆరో ప్లాంట్



అడుగున మట్టి రేణు వులతో దర్శనమిస్తుంది. ఆర్వో ప్లాంట్ పరిసర ప్రాంతం అపరశుభ్రంగా ఉన్న పట్టించుకోలేని దుస్థితి.

అరకొర మెష్‌లు.. మరమ్మత్తుల్లో కిటికీలు..

ఇటీవల వర్షాలు కురుస్తున్న సందర్భంలో విష జ్వరాల పీడతలను మనం చూస్తున్నాం. హాస్టల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ మరమ్మతులకు గురైన కిటికీలు దర్శనమిస్తున్నాయి. కనీసం కిటికీలకు మెష్‌లు కూడా అమర్చలేని పరిస్థితులు ఈ హాస్టల్లో నెలకొన్నాయి. అట్లేమైనా మెడికల్ క్యాంపులు పెడుతున్నారంటే అది కూడా లేదు.

అపరిశుభ్ర భోజనం.. అరా కొరా భోజనం..



వంట చేసేముందు రేషన్ బియ్యాన్ని బాగా నీటితో శుభ్రపరిచి తరువాతే వంట చేయాలి. అప్పుడే పిల్లలు భోజనం తినడానికి వీలుగా ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం అది చేయకపోగా ఒకసారి బియ్యాన్ని నీళ్లలో వేసి అలాగే వండేస్తున్నాడం వలన వాసనగా ఉండడంతో చాలామంది విద్యార్థులు తినలేక కడుపులు కాల్చుకుంటున్నారు. ఇదొక వింత అయితే 120 మంది విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్లో అరకొర మాత్రమే భోజనంతో సర్దడం గమనార్హం. దీంతో పిల్లల కనీస పౌష్టికాహారం కొరత ఉందని తెలుస్తున్నది.

కూరగాయలుకు కరువా..?

విద్యార్థులు పౌష్టికంగా ఉండి బాగా చదవాలంటే తిండి ఎంతో అవసరం. తల్లిదండ్రులు తమ పిల్లలకు కనీస తిండి అందించలేక ప్రభుత్వ వసతి గృహాలలో చేర్పించడం జరుగుతుంది. కానీ ఇక్కడ అది కూడా తీర్చలేని పరిస్థితి. 120 మంది విద్యార్థులు ఉన్న ఈ హాస్టల్లో కనీసం ఎటువంటి కూరగాయలు లేని పరిస్థితి.



జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి : సిపిఎం నాయకులు రంగయ్య

పల్లం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మండల సిపిఎం నాయకులం బుధవారం సందర్శించడం జరిగింది. ఈ హాస్టల్లో చదువుకునే విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా పరిస్థితులు చూశాం. వాచ్మెన్ దగ్గర నుండి వంట మనిషి వరకు ఒకరే విధులు నిర్వహిస్తున్నారు. నీటి సౌకర్యం లేక అపరశుభ్రంగా మరుగుదొడ్లు, ఆరు బయట స్నానాలు చేస్తున్న పరిస్థితి. ఒకరే ఉండడంతో పిల్లల గదుల్లో చెత్తను తీసే పరిస్థితి లేదు. కనీసం జీలకర రైస్ లో ఉప్పులేక చాలామంది పిల్లలు తినలేదు. 120 మంది పిల్లలు ఉన్నా కొంత మేరకే భోజనం చేస్తున్నారు. మిగతా పిల్లలు ఖాళీ గడుపుతో బడికి వెళ్తున్నారు. కూరగాయలు అసలే లేవు. ఇక్కడ భోజనం సరిగా అందించలేదని కొంతమంది విద్యార్థులు హాస్టల్లో ఉండకుండా ఇంటి బాట పడుతున్నారు. వెంటనే వంట మనిషి, కామటి నియమించాలి. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని పేద విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని సిపిఎం పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి



తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. బుధవారం 30 వ వార్డులోని రిజర్వాయర్ కాలనీ, ఆయుర్వేదిక్ హాస్పిటల్, స్విమ్స్ కూడలి ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుధ్య పనులను పరిశీలించారు. నిత్యం చెత్త సేకరణకు వాహనాలు వస్తున్నాయా? తదితర విషయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చాలా మంది తమ ఇండ్లలోని చెత్తను బయట పడేసి బాధ్యత లేకుండా ఉంటున్నారన్నారు. ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే తమ వాహనాలు, సిబ్బందికి చెత్త అందించి నగర శుభ్రతకు సహకరించాలన్నారు. కాలువల్లో చెత్త వేయడం వలన అవి బ్లాక్ అయ్యి రోడ్లపైకి నీరు వచ్చి ప్రజలకు ఇబ్బంది అవుతోందన్నారు. హాస్పిటల్ వ్యర్థాలు కాలువల్లో వేయొద్దని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు మధు, శిల్ప, ఏ సి పి మధు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

మద్యం కేసులో కొనసాగుతున్న సిట్ దర్యాప్తు

చిత్తూరు, తిరుపతి నగరాల్లో సిట్ తనిఖీలు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రాష్ట్రంలో సంచలనం రికెత్తించి, వైసీపీకి చెందిన పలువురు సీనియర్ నాయకులను జైలుపాలు చేసిన లిక్కర్ స్కాం దర్యాప్తు ఊపందుకుంది. సిట్ అధికారులు బృందాలుగా ఏర్పడి, ఏకకాలంలో చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్‌లలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. తిరుపతి, హైదరాబాద్‌లోని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కంపెనీల్లో సిట్ సోదాలు చెప్పటింది. చిత్తూరులోని చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి చెందిన ఇన్ఫ్రా కంపెనీలో, బీవీరెడ్డి కాలనీ, నలందా నగర్, నిఖిలానంద అపార్ట్మెంట్లోని కార్యాలయంలో సిట్ తనిఖీలు చేపట్టింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ప్రశాంతి హిల్స్‌లో ఫ్లాట్ నెంబర్ 35లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి చెందిన కంపెనీలోను తనిఖీలు నిర్వహించగా సిట్ తనిఖీల్లో ఆసక్తికర అంశాలు బయటపడుతున్నాయి. వరుస తనిఖీల్లో డొల్ల కంపెనీలు వివరాలు బయటపడుతున్నాయి. రికార్డుల్లో ఉన్న కంపెనీ పేరు వేరు... భౌతికంగా ఉన్న కార్యాలయం మరొకటి, లిక్కర్ స్కాంలో నిందితుల లింకులను, చైన్‌ను బండారం బట్టబయలైంది. చిత్తూరు సిఎంఆర్ కంపెనీ వద్దకు తనిఖీలకు అని వెళితే అక్కడ వెల్ టాస్క్ ఫుడ్ అండ్ బేవరేజెస్ పేరుతో బోర్డు ఉండడం గమనార్హం. వెల్ టాస్క్ ఫుడ్ అండ్ బేవరేజెస్ కంపెనీ వైసీపీ నేత విజయానంద్ రెడ్డి సంస్థగా గుర్తించారు. ఈ కార్యాలయంలో జరిపిన తనిఖీల్లో రహస్యంగా ఉంచిన మోహిత్‌రెడ్డి కంపెనీ వివరాలు, విజయానంద్ రెడ్డి కంపెనీ వివరాలు రికార్డులు లభ్యమైయ్యాయి. హైదరాబాద్‌లోని ప్రశాంతి హిల్స్‌లో భీం స్పేస్ కార్యాలయానికి వెళ్లిన ఇషా ఇన్ ఫ్రాం పేరుతో బోర్డు కనిపించింది. ఈ ఇషా ఇన్ ఫ్రా కంపెనీలో డైరెక్టర్లుగా సజ్జల భార్గవరెడ్డి, ప్రద్యుమ్న వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. ఎన్నికల సమయంలో రూ.8 కోట్లు పట్టుబడగా, అవి నావే అని ప్రద్యుమ్న క్లైమ్ చేసుకున్న విషయం విధితమే. బుధవారం రాత్రి కూడా మూడు ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నారు. వీటిని ఆధారంగా చూపించి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి, పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, విజయానంద్ రెడ్డిపై కేసును మరింత తీవ్రతరం చేయనున్నట్లు సమాచారం.

తిరుమలలో అనధికారిక హాకర్లతో బేజారు

- స్థానికులకు నష్టం కలిగిస్తున్నా టీటీడీ ప్రేక్షక పాత్ర
- ఆగ్రహం వ్యక్తం చేసిన తిరుమల పరిరక్షణ సైన్యం


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పవిత్రమైన తిరుమలలో అనధికారిక హాకర్లతో భక్తులకు, ఇటు స్థానికంగా ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించిన స్థానికులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, దీనిపై పాలకమండలిలో తీసుకున్న నిర్ణయం మేరకు టాస్క్ ఫోర్స్ ఉపయోగించి అనధికారిక హాకర్లను కొండ దించాలని తిరుమల పరిరక్షణ సైన్యం ప్రతినిధులు లక్ష్మీపతి టీటీడీ డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో సైన్యం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హాయంలో విచ్చలవిడిగా రాజకీయ ప్రోత్బలంతో అనధికారిక హాకర్ల రాక జరిగిందని, ప్రస్తుతం ఉన్న టిటిడి బోర్డు నిర్ణయం మేరకు టీటీడీకి ఎటువంటి రుసుములో చెల్లించకుండా భక్తుల నుండి దోచుకునే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ నిమ్మకుండిపోవడం వలన స్థానికులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. పాలకమండలికి, అధికారులకు ఉన్న సమన్వయలోపం కారణంగా స్థానిక వ్యాపారులకు తీవ్ర నష్టం వాటిల్తోందన్నారు. ఇప్పటికైనా టిటిడి స్పందించి తిరుమల కొండపై తిష్టవేసిన అనధికారిక హాకర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే తిరుమల పరిరక్షణ సైన్యం ఆధ్వర్యంలో టిటిడి పరిపాలన భవనాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రామచంద్రయ్య, వేణు, కృష్ణ, వాసుదేవన్ పాల్గొన్నారు.

7న టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):ఈనెల ఏడవ తేదీన తిరుపతి నగరంలో శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియం వేదికగా ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంటును నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి పి. బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను మీడియాకు వివరించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 20080 మంది క్రీడాకారులు ఒకే వేదికపై తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారన్నారు. గెలుపొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు.

పర్యావరణహితం 'స్వచ్ఛరథం'

- గ్రామాల పరిశుభ్రతకు ఉపయుక్తం ఈ రథం
- వ్యర్థాల నుండి వస్తు కొనుగోలు విధానం







ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గతంలో పరిశీలిస్తే గృహంలో వినియోగ వ్యర్థాలను పోగుచేసి రోడ్లపై తిరుగుతూ ఈ వ్యర్థాలను కొనుగోలు చేసి అందుకు తెల్ల గడ్డలు, బఠానీలు, ఉప్పు చెనుగులు, చక్కెర పాకంతో తయారుచేసిన తినుబండారాలు, పుల్ల ఐస్‌లు, కర్జూరం ఇచ్చేవారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్లాస్టిక్ వినియోగం, ఆ వ్యర్థాల వలన కలిగే పర్యవసానాలకు చెక్ పెట్టడానికి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత వైసిపి హాయంలో ఇంటింటికి రేషన్ అందించిన ఎండియు వాహనాలను చిన్నపాటి మార్పులు చేసి తద్వారా ఇళ్ల వద్ద వినియోగించిన వ్యర్థాలకు గృహ వినియోగ సరుకులను అందించే విధంగా " స్వచ్ఛ రథం "కాన్సెప్ట్‌ను ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టింది. మొదటగా గుంటూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలలో ఇది విజయవంతం కావడంతో తిరుపతి జిల్లాలోని కరకంబాడి, తిరుచానూరు గ్రామపంచాయతీలలో ప్రస్తుతం స్వచ్ఛ రథం సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ స్వచ్ఛ రథం ద్వారా ఇళ్ల వద్దకే స్వచ్ఛరథం రథసారథి సరుకులను తీసుకువచ్చి ప్రజల వద్ద నిల్వ ఉంచిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇనుప సామాగ్రి, వినియోగం లేని వస్తువులను తీసుకొని అందుకు బదులుగా పప్పు దినుసులను, గృహ అవసరాల వస్తువులను ఇస్తున్నారు. సేకరించిన వ్యర్థాలను రథసారధి గుజిరీల షాపులకు చేరుస్తున్నారు.

స్వచ్ఛరథం తయారీ ఇలా..

పర్యావరణహితం కోరి రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ నూతన స్వచ్ఛ రథం కోసం గతంలో వినియోగించిన ఎండియు వాహనాలు ఇందుకు అనుగుణంగా ఉంటాయని, ఈ వాహనాన్ని స్వచ్ఛ రథం వస్తువులు అమరికకు, వినియోగానికి అనుకూలంగా మనసుకోవడానికి ఏదైతే గ్రామపంచాయతీకి ఈ స్వచ్ఛరథం కేటాయింపబడుతుందో ఆ గ్రామపంచాయతీ నుండి వాహనంలో మార్పు కోసం రూ.90 వేల రూపాయలు మంజూరు చేయబడుతుంది. స్వచ్ఛ రథం రథసారధికి జీతం గా రూ.21 వేలు, ప్రతినెల రూ.4 వేల రూపాయల పెట్రోల్ అందిస్తారు. కోటి ఆదాయం దాటిన పంచాయతీలలో ఈ స్వచ్ఛరథం అమలుకు వెసులుబాటు ఉంది. రథసారథి ప్రతిరోజు 150 కేజీల వస్తువులను 50 రకాలు (ప్రజలకు అవసరమైన, వ్యర్థాల బరువులను బట్టి వస్తువులను ప్యాకింగ్ చేసుకొని) తీసుకొని రావాల్సి ఉంటుంది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో 2 పంచాయతీలలో అమలు అవుతున్న స్వచ్ఛ రథం కాన్సెప్ట్, ఇంకను జిల్లాలో 11 పంచాయతీలలో అమలు చేయడానికి అవకాశాలు ఉన్నట్లు జిల్లా పంచాయతీ శాఖ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ షణ్ముగ రామ్ తెలిపారు.

ఇటీవల కమిటీ పరిశీలన..

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన స్వచ్ఛ రథం కాన్సెప్ట్ క్షేత్రస్థాయిలో అమలు, ప్రజాదరణ వంటి విషయాలను తెలుసుకోవడానికి ప్రభుత్వం నుండి ఓ కమిటీ పరిశీలన చేసి తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు చేసింది. ఇది ప్రజలు ఆదరించేలా ఉందని, ఇందుకు మరింత ప్రాచుర్యం కల్పించగలిగితే ప్లాస్టిక్ వినియోగ వ్యర్థాల నిర్వహణ ప్రభుత్వానికి మరింత సులువు అయ్యే అవకాశాలు ఉన్నట్లుగా రిపోర్టులో ఉన్నట్టు సమాచారం.

పరిసరాల పరిశుభ్రతకు, పర్యావరణహితానికి..

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన స్వచ్ఛ రథం కాన్సెప్ట్ ద్వారా పరిసరాల పరిశుభ్రత, మురుగునీటి కాలువలలో వ్యర్థాలను వేయడంపై ప్రజల్లో అవగాహన, పర్యావరణహితానికి తోడ్పాటు అందిస్తుంది. స్వచ్ఛరథం ద్వారా సేకరించిన వివిధ రకాల వ్యర్థాలను గుజరీలకు చేరి వాటి నిర్వహణ జరుగుతూ, ఇదే సమయంలో ఉపాధి అవకాశం కల్పించ బడుతోంది. ప్రయోగాత్మ కంగా చేపట్టిన స్వచ్ఛందం పైలట్ ప్రాజెక్టును ఈ ఏడాది 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలలో లాంచనంగా జిల్లాలో ప్రారంభించాము. రాబోయే రోజుల్లో కోటి ఆదాయం దాటిన పంచాయతీలను గుర్తించి అక్కడ అమలు చేస్తూ, ఈ స్వచ్ఛరదం కావాలనుకునే పంచాయితీలు ఆదాయాలు తక్కువ ఉన్న నాలుగైదు పంచాయతీలు కలిపి నిర్వహణ బాధ్యతను తీసుకోవచ్చు.



- సుశీలదేవి, జిల్లా పంచాయతీ అధికారిని, తిరుపతి జిల్లా

ఆస్పత్రి స్థాయి పెంచండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌ను 30 నుంచి 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ, మార్పుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వెలువడ్డాయి. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కృషితో ఈ ఆదేశాలు రావడం జరిగిందని ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

జిల్లా ఆర్టీసీ పిఐగా చాందిని

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఏపీఎస్ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయం పర్సనల్ ఆఫీసర్‌గా చాందిని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో పర్సనల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సహజ తిరుపతి ఇన్చార్జి పర్సనల్ ఆఫీసర్‌గా ఉన్న విషయం విధితమే. ఆయనను చిత్తూరు జిల్లా పర్సనల్ ఆఫీసర్‌గా పూర్తిస్థాయిలో నియమిస్తూ, తిరుపతి జిల్లా నుంచి రిలీవ్ చేశారు. ఆయన స్థానంలో తిరుపతి డిపోలో అక్కిడెంట్ ఇంజనీర్ (మెకానికల్) గా బాధ్యతలు నిర్వహిస్తున్న చాందిని పర్సనల్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధికారులు సిబ్బంది ఆమెను ఈ సందర్భంగా అభినందించారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి టీడీపీ పట్టణ, మండల బాధ్యులను ఆదేశించారు. స్థానిక పిఆర్ అతిథి గృహంలో బుధవారం టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జిలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారిస్తూ పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కార మార్గాలను అన్వేషించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

తాగు నీటి సౌకర్యం పునరుద్ధరణ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల పరిధి, దుగరాజపట్నం పంచాయతీ, కొత్తూరు గ్రామానికి రక్షిత మంచినీరు సరఫరా కావటం లేదని మంగళవారం గ్రామస్తులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న ఎంపీడీవో శ్రీనివాసు లు, మత్స్యకార నాయకుడు మహేంద్ర సహకారంతో, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ సుమాంజలి పర్యవేక్షణలో నీటి సౌకర్యం పునరుద్ధరించారు.

వేదిక్ విద్యాన్ స్కూల్లో అన్నదానం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి, కొరమేను గుంట, వేదిక్ విద్యాన్ స్కూల్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 11 రోజులపాటు స్కూల్లో విగ్రహాన్ని ఏర్పాటుచేసి, పోటీలో విద్యార్థులు మట్టి, పేపర్ పల్ప్, ప్రకృతి సిద్ధ పదార్థాలను ఉపయోగించి సృజనాత్మకంగా గణేశ విగ్రహాలను తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన పదార్థాల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాలనే అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యమని పాఠశాల వ్యవస్థాపకులు మహేష్, ప్రిన్సిపాల్ తెలిపారు. "ఇకపై ప్రతి ఇంటిలోనూ పర్యావరణ హిత గణేశ విగ్రహాలనే ప్రతిష్ఠించాలని మనమందరం ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూలు ఉపాధ్యాయులు స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయ భవన పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తిలో కేంద్రీయ విద్యాలయం నిర్వహణకు అనువైన భవన సముదాయాన్ని శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. స్థానిక కైలాస గిరి కాలనీలో ఉన్న తెలుగు గంగ క్వార్టర్స్‌లో ఖాళీగా ఉన్న భవనాలు అనువుగా ఉన్నాయా లేదో అధికారుల ద్వారా ఆరా తీశారు.

చికెన్ వ్యర్థాలను తొలగించాలి

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు - శ్రీకాళహస్తి మార్గం, ఏర్పేడు-వెంకటగిరి రహదారుల వెంబడి నిత్యం చికెన్ వ్యర్థాలతో దుర్గంధమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్లి దుర్వాసనతో ఇటు ప్రయాణికులకు, అటు సమీప గ్రామస్తుల వాసన భరించలేక ఇబ్బంది పడుతున్నారు. ఐసర్ హాస్టల్ సమీపంలో వెలువడే దుర్వాసనతో హాస్టల్లోని విద్యార్థులు భరించలేక సతమతమవుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ఈ చికెన్ వ్యర్థాలను తొలగించాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆన్‌లైన్లో ఇంటి పన్ను చెల్లింపుపై అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు గ్రామపంచాయతీని జిల్లా గ్రామపంచాయతీ అధికారి సుశీల దేవి బుధవారం సందర్శించి స్వర్ణ పంచాయతీ ద్వారా ఆన్లైన్‌లో ఇంటి పన్ను చెల్లింపు విధానాన్ని ప్రజలకు వివరించారు. సర్పంచ్ శివయ్య, గ్రామస్తుల ఇంటి పన్ను ఆన్లైన్‌లో చెల్లింపజేసి వారికి రశీదులు ఇప్పించారు. అనంతరం స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి రమణ కుమార్, ఏర్పేడు, ఆముదాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణ యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్, ట్రైనర్ ఆయినా రాజశ్రీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రమిజబీ ఎంఎస్ ఆఫీస్ పై రెస్యూమ్ ప్రిపరేషన్, డాకుమెంట్స్ ప్రిపరేషన్, ఎక్సెల్ డేటా షీట్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ మొదలగు వంటి అంశాల పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రొఫెసర్ శోభా రాణి మాట్లాడుతూ 30 రోజులు జరిగిన శిక్షణ కార్యక్రమంలో విద్యార్థినిలు ఎంఎస్ ఆఫీస్ మెలుకువలపై పట్టు సాధించడం అభినందనీయం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి నెల క్రమం తప్పకుండా విద్యార్థులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల


జిల్లా పంచాయతీ అధికారిని సుశీలదేవి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుపతి జిల్లాలోని ఎన్నికలు జరిగిన 745 గ్రామ పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.63,62,55, 046/- నేరుగా గ్రామపంచాయతీల యూనియన్ బ్యాంకు ఖాతాలకు జమ చేశామని జిల్లా పంచాయతీ అధికారిని సుశీలదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి, రెండో విడత టైడ్, అన్ టైడ్ (బేసిక్) గ్రాంట్ లు కలిపి నిధుల విడుదల చేయడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాలో అత్యధికంగా రేణిగుంట మండలం రేణిగుంట గ్రామపంచాయతీకి రూ.43,03,669/-, అత్యల్పంగా పిచ్చాటూరు మండలం అప్పలరాజు కండ్రిగ గ్రామపంచాయతీకి రూ.53,582/- రూపాయలు నిధుల విడుదల చేయడం జరిగిందన్నారు. 2022 మే 12వ తేదీన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ నిధులలో 50 శాతం పారిశుద్ధ్య అవసరాలకు, మరో 50 శాతం తాగునీరు, వర్షపు నీటి నిల్వ, నీటి సంరక్షణ, పునరుత్పత్తులకు మాత్రమే వినియోగించాలని ఆదేశించామన్నారు. మరే ఇతర అవసరాలకు ఈ నిధులను వినియోగించిన ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

శిధిలావస్థకు చేరుతున్న టిడ్కో గృహాలు

- ప్రజల మనుగడకు ఉపయోగకరమేనా..?
- అడియాశవుతున్న పేదల సొంతింటి కల





ప్రజాశక్తి - నాయుడుపేట: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు పేద బడుగు బలహీన వర్గ ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టిట్కో గృహాల నిర్మాణం రాష్ట్రంలో పలుచోట్ల అర్ధాంతరంగా నిలిచిపోయిన విషయం అందరికీ తెలిసిందే. 2014,19 మధ్య కాలంలో రాష్ట్రంలో చాలా చోట్ల నిర్మాణాలు పూర్తిచేసుకుని ఎంతోమందికి నివాసయోగ్యాలుగా మారినప్పటికీ చాలామందికి నిరాశే మిగిల్చిందని చెప్పవచ్చు. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నది వాస్తవం. తిరుపతి జిల్లా, నాయుడుపేట ప్రజల కోసం బిరదవాడ సమీపంలో చెన్నై, నెల్లూరు హైవే పక్కనే దాదాపుగా 2850 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు కాగా అందులో ముప్పావు వంతు ఆపార్ట్‌మెంట్లు 90 శాతం నిర్మాణం పూర్తయింది. చేతికందుతాయన్న దశలో ఎన్నికలు ప్రారంభం కావడంతో నిర్మాణాలు పూర్తిగా నిలిపివేశారు. 2019 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన వైసీపీ ప్రభుత్వం తమ కలలను నిజం చేస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్న ప్రజలకు ఆ ప్రభుత్వం నిరాసే మిగిల్చింది. మూడు కేటగిరీల్లో నిర్మించిన ఈ గృహాల కోసం ప్రజలు 12,500 నుంచి లక్ష రూపాయల వరకు డబ్బు చెల్లించిన వారు ఉన్నారు. వారికి న్యాయం చేయకపోగా ఆ గృహాలను కరోనా సమయంలో క్వారంటైన్లుగా ఉపయోగించడమే కాక గృహ నిర్మాణాలను పూర్తి చేస్తామని నమ్మబలికి ఒక్కొక్క లబ్ధిదారులపై మూడు లక్షలకు పైగా బ్యాంకు రుణాలు తీసుకుని వారిపై ఆ భారాన్ని మోపి ప్రభుత్వం ప్రజల ఆశలతో ఆట్లాడుకుంది. ఐదేళ్ల నుంచి శిధిలావస్థలో ఉన్న ఈ గృహాలను ఇప్పుడు ప్రజలకు ఇచ్చినా వారు వాటిని ఇప్పుడు ఆనందంగా తీసుకోగలరా, ఆ గృహాలలో ప్రశాంతంగా జీవించగలరా అన్నది ప్రశ్నార్ధకమైంది. ప్రభుత్వం బ్యాంకులలో లబ్ధిదారులపై తీసుకున్న రుణాలు చెల్లించాలంటూ బ్యాంకు సిబ్బంది ఇప్పటికీ లబ్ధిదారులకు ఫోన్లు చేస్తూ రుణాలు చెల్లించాలంటూ వేధిస్తున్నారు. లబ్ధిదారుడు ఎవరిని అడగాలో.. ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేద నకు గురవుతున్నాడు. మరలా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయినప్పటికీ వాటిపై ఏమాత్రం స్పందన లేకపోవడంతో పేదల ఆశలు నిరాశలయ్యాయి. శిధిలావస్థకు చేరిన ఆ గృహాలను వద్దనుకుంటే కట్టిన డబ్బు తిరిగి వస్తుందా రాదా అని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు పేదల ఆవేదనను అర్థం చేసుకొని టిడ్కో ఇళ్లను ఒక కొలిక్కి తేవాలని కోరుతున్నారు.

నాయుడుపేటలో

ఏడేళ్లుగా శిథిలావస్థలో ఉన్న టిడ్కో గృహాలు ప్రజలకు ఉపయోగకరంగా మారుతాయా..? పేదలు సొంతింటి కల, ఎన్నో ఆశలతో కూలి నాలి, అప్పులు చేసి కట్టిన డబ్బులకు న్యాయం జరుగుతుందా..? నాయుడుపేటలో ఏడేళ్లుగా శిథిలమైపోయిన గృహాలను తీసుకునేందుకు ప్రజలు సుముఖత చూపిస్తారా..? టిడిపి ప్రభుత్వం వారికి ఎలాంటి న్యాయం చేయమంది..? అన్న వాదనలు పట్టణంలో రోజురోజుకీ అధికమవుతున్నాయి.

సొంతింటి కల నెరవేరుతుందని, ఆరేళ్లకు ముందు గృహాలను అందజేస్తారని ఆశపడ్డాం. గత ప్రభుత్వం మా పేర్లతో బ్యాంకు రుణం తీసుకోవడం దారుణం. బ్యాంకు సిబ్బంది డబ్బు కట్టమంటే ఎక్కడ నుంచి తేవాలి..? ప్రభుత్వం స్పందించి మా ఇళ్లను ఇవ్వాలి.

- దారా సుజాత, టిడ్కో ఇంటి లబ్ధిదారు

అపార్ట్మెంట్లో 10 కుటుంబాలతో కలిసి ఉండొచ్చ అన్న ఆనందంతో తీసుకోవాలనుకున్నాం. 2019 కి ముందే ఇళ్ళు పూర్తి చేసి ఇస్తారన్న ఆనందంలో 50వేల రూపాయలు డబ్బులు కూడా చెల్లించాం. ఇల్లు చేతికొస్తుందనుకున్న సమయంలో ఎలక్షన్లు వచ్చి, ప్రభుత్వాలు మారి అవాంతరాలు ఎదురయ్యాయి. కొత్త ప్రభుత్వం వచ్చి సంవత్సరా దాటినా టిడ్కో ఇళ్లను పట్టించుకోవడం లేదు. మా పేర్లపై ప్రభుత్వం తీసుకున్న లోన్లకు జవాబుదారీ ఎవరో తేల్చాలి. మా ఖాతాలో డబ్బు ఉంటే బ్యాంకు వారు కట్ చేస్తున్నారు. అటు ఇల్లు చేతికి రాక, డబ్బు వృధాఅయి పోయింది. అధికారులు త్వరలో ఈ సమస్యను పరిష్కరించాలి.

- ఎం.రూపదేవి, టిడ్కో ఇంటి లబ్ధిదారు

మూడు కేటగిరీల్లో మొత్తం 2064 మంది టిడ్కో ఇంటి లబ్ధిదారులున్నారు. 300 స్క్వయర్ ఫీట్ 1152, 365 స్క్వయర్ ఫీట్ 624, 430 స్క్వయర్ ఫీట్ దాదాపుగా అన్ని పూర్తిగావచ్చాయి. త్వరలోనే అన్ని నిర్మాణాలు పూర్తి చేసి అన్ని వసతులతో డిసెంబర్ కల్లా లబ్ధిదారులకు గృహాలు అందిస్తాం. మొత్తం 361 మంది లబ్ధిదారులపై బ్యాంకు రుణాలు ద్వారా తొమ్మిది కోట్ల 26 లక్షల రూపాయలు గత ప్రభుత్వానికి అందజేశాం. టిడిపి ప్రభుత్వం వచ్చాక ఒక్కో లబ్ధిదారులకు 80 వేలకు పైగా చెల్లించింది. మిగతా వారికి కూడా బ్యాంకు లోన్ ప్రాసెస్ పూర్తి చేసి, గృహాలను అందిస్తాం.

- ఫజులల్లా, మున్సిపల్ కమిషనర్

పోలేరమ్మ జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



పోలేరమ్మ జాతర పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి పోలేరమ్మజాతరను అధికారులందరూ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలియజేశారు. బుధవారం వెంకటగిరి స్థానిక పింజలవీరయ్య కళ్యాణమండలంలో ఏర్పాటు చేసిన జాతర సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 నుంచి 11 వ తేది వరకు జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని, ప్రభుత్వం ఈ పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన నేపథ్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. క్యూ లైన్ నియంత్రణ, కంట్రోల్ రూం ఏర్పాటు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, మెడికల్ క్యాంపు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా జనరేటర్ ఏర్పాట్లు చూడాలని, ఫైర్ సేఫ్టీ, బ్యారికేడ్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ అనౌన్స్మెంట్, రవాణా సౌకర్యం, హెల్ప్ డెస్క్ తదితర ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండాలి అని సంబంధిత అధికారులను ఆదేశించారు. వెంకటగిరి నియోజకర్గ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అందరి సహకారంతో భక్తులకు అమ్మవారు దర్శనం కలిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో కన్నా రేట్లు తగ్గించి రూ.300, ఉచిత దర్శనం వంటి ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఎస్.పి.హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ గీతా కుమారి, జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా బానుప్రియ, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితర అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని ప్రార్ధనా మందిర నిర్మాణం అపాలి



ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని నేన్నూరు పంచాయతీ, చెంచులక్ష్మి కాలనీలో అనుమతులు లేకుండా క్రిస్టియన్ పాస్టర్ సువర్ణలత చర్చి నిర్మాణం చేపట్టుతున్నదని, చర్చి నిర్మాణాన్ని అడ్డుకోవాలని తహశీల్దార్ మధుసూదన్ రావుకి బుధవారం కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు కాలనీ వసులు అందరూ యానాదులని, హిందూ మతానికి సంబంధించిన వారేనని తెలిపారు. ఈ ప్రదేశంలో అన్యమత ప్రచారకర్త సువర్ణలత స్థలం ఆక్రమించుకుని, చర్చ నిర్మించి అన్యమత ప్రచారానికి కేంద్రంగా మారుస్తోందని ఆరోపించారు. పాస్టర్ సువర్ణతది చిత్తూరని, చెంచులక్ష్మి కాలనీలో యానాది మహిళలను మోసం చేసి స్థలం ఆక్రమించుకునిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలంలో శాశ్వతంగా చర్చిని నిర్మించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోందన్నారు. మా కులదైవం చెంచులక్ష్మి విగ్రహాన్ని పెట్టుకుని పూజించుకుంటామని, ఆ స్థలం తమకు కేటాయించాలని తహశీల్దార్‌ను కోరారు. చర్చ నిర్మాణాన్ని అడ్డుకుంటే మీ అంతు చూస్తామని, తిరుపతి నుంచి రౌడీలను తీసుకువచ్చి బెదిరిస్తున్నారని ఆర్ సి పురం ఎస్సై మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా పాస్టర్ సువర్ణ లత కూడా తహశీల్దార్‌ను కలిసి చర్చి నిర్మించడం లేదని, ఆ స్థలం సుబ్రహ్మణ్యం కూతురు మల్లిక వద్ద కొనుగోలు చేశానని, గత 15 సంవత్సరాలుగా ఆ స్థలంలోని గుడిసెలో క్రిస్టియన్ మత ప్రార్ధనలు చేసేవారమని తెలిపారు. నేను చెంచులక్ష్మి కాలనీలో చర్చి నిర్మాణం చేయడం లేదని, ఇల్లు కట్టుకునేందుకు అనుమతి ఇవ్వాలని తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు.

భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): రైతులు భూసార ఫలితాలను అనుసరించి ఎరువులు వాడాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా ఏరువాక కేంద్రం(డాట్ సెంటర్), చిత్తూరు కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణా రావు సూచించారు. చంద్రగిరి మండలం, పనబాకం, డోర్నకంబాల గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తుంది, గ్యాప్ పొలంబడి కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తప్పక భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. వరిని ఆశించే వివిధ రకాల తెగుళ్ల నివారణ గురించి వివరించారు. గ్యాప్ పొలంబడిలో భాగంగా వేరుశనగలో ఆశించే పురుగులు తెగుళ్ల నివారణ కోసం సమగ్ర సస్యరక్షణ గురించి రైతులకు తెలిపారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు, పచ్చి రొట్ట పంటలు, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా జీవ సంబంధమైన మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పథకాలను వివరించారు.అనంతరం వరి పంటను సందర్శన చేసి వరి పంటలో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి మండల వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, రైతు సేవా కేంద్రం డోర్న కంబాల వి. ఎస్.ఎ షారోన్ పలువురు రైతులు పాల్గొన్నారు.

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం శాస్త్రి ఇండో కెనడియన్ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్‌కు షార్ట్ లిస్ట్ చేయబడినదని వర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఆమె మాట్లాడుతూ దేశం మొత్తంమీద ఈ ప్రాజెక్టుకు 30 యూనివర్సిటీలు దరఖాస్తు చేయగా, నాలుగు యూనివర్సిటీలు ఎంపికయినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కాల వ్యవధి రెండు సంవత్సరాలన్నారు. ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ అనే థీమ్ పై, కమ్యూనిటీ హెల్త్ అండ్ న్యూట్రీషియన్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ కెనడా వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వర్సిటీకి రావడంపై పలువురు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: నేరాల నియంత్రణకు చర్యలు చేపడతామని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్, గూడూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్, గూడూరు టూ టౌన్ పోలీసు స్టేషన్లలో తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించి, సిబ్బంది చేస్తున్న డ్యూటీ విషయంలో సూచనలు చేశారు. గ్రేవ్ కేసులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకుని కేసులు చేదించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, సాయంత్రం సమయంలో పార్కులలో వాకింగ్ చేస్తున్న వృద్ధులతో ఇంట్రాక్ట్ అవుతూ వాళ్ల సమస్యలు తెలుసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పల్లెల్లో రాత్రి సమయంలో పల్లె ప్రజలతో ఇంట్రాక్ట్ అవుతూ ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల్లో గూడూరు డీఎస్పీ గీతా కుమారి, సిఐ లు కిషోర్ బాబు, శేఖర్ బాబు, శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలు జయప్రదం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: బుధవారం ఉదయం యుటిఎఫ్ ఆఫీస్ వద్ద సిఐటియు వెంకటగిరి మండల ఏడవ మహాసభలు జరిగాయి. ఈ మహాసభల్లో ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా నాయకులు మునిరాజా మాట్లాడుతూ కార్మిక వర్గం ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వెంకటగిరి మండలంలో కూడా అన్ని కార్మిక సంఘాల మధ్య ఐక్యతను సాధించి మండల స్థాయిలో ఒక టీం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. అనంతరం వెంకటగిరి మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు- ఏ మంజుల, కార్యదర్శి- వడ్డిపల్లి చెంగయ్య, ఉపాధ్యక్షులుగా- వి పెంచలయ్య వి సుభాషిని ఎన్ చిరంజీవి వెంకటమ్మ మరియు సహాయ కార్యదర్శులుగా ఎంవి రమణ పి సుబ్రహ్మణ్యం ఆర్ కృష్ణయ్య మమత మరియు కోశాధికారిగా నిర్మల, కమిటీ సభ్యులుగా సుబ్బరామయ్య, ప్రసాద్ వేమయ్య రోజా రమణి అన్నపూర్ణ కవిత గిరిజమ్మ నాగమణి, వెంకటమ్మ మారెమ్మ, పి ఆర్ ఏ రాజయ్య- మొత్తం 23 మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో అంగన్వాడి, మధ్యాహ్నం భోజన పథకం, ఆశా వర్కర్స్, స్కూల్ పేపర్స్, ఆటో, హమాలీలు, అద్దె బస్సు డ్రైవర్స్, ఉపాధి కూలీలు, వీధి విక్రయదారులు మున్సిపల్ తదితర రంగాల కార్మికులు పాల్గొన్నారు.

గుత్తివారిపల్లెలో డయేరియా

ప్రజాశక్తి - రేణిగుంట : శ్రీకాళహస్తి నియోజకవర్గం, రేణిగుంట మండలం, గుత్తివారిపల్లిలో ఇప్పటివరకు 70 మంది గ్రామస్తులకు డయేరియా వ్యాధి వ్యాప్తి చెందింది. అందులో ఒకరు మృతి చెందారు. బాలాజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యం వల్లే డయేరియా వ్యాప్తి చెందిందన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పరామర్శ

కలుషిత నీరు తాగడంతో డయేరియా బారిపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. తాగునీటి వ్యవస్థను మెరుగుపరచాలని ఆర్వో ప్లాంట్ వాటర్‌ను పరీక్ష చేసి దానికి ప్రత్యామ్నాయ తాగునీటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జనసేనలో నవతరం యువకులదే కీలక బాధ్యత : పసుపులేటి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జనసేన పార్టీలో ఇకపై పవన్ కళ్యాణ్ ఐడియాలజీ ప్రకారం ఎటువంటి రాజకీయ ప్రస్థానం లేని వారు, పార్టీ కోసం ఇన్నేళ్లుగా కృషిచేసిన యువకులదే కీలక బాధ్యతగా నియోజకవర్గాల ఇన్చార్జిలు నియమించడం జరిగిందని, ప్రజల్లో పవన్ కళ్యాణ్ పట్ల మరింత అభిమానం పెరిగిందని, రాబోయే రోజుల్లో ప్రజలే ఫ్లెక్సీలు కట్టే పరిస్థితులు రానున్నాయని ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమల శ్రీవారి ఆలయం ధర్మకర్తల మండలి బోర్డు టిడిపి తీసుకుంది కనుక ఆయన చెల్లెలుగా భావించే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయం బోర్డు జనసేన పార్టీకి ఇవ్వాలన్నారు. దేశ రాజకీయాల్లో జనసేన పార్టీ ఇప్పటికే మార్పులు తీసుకువచ్చిందన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదిన పురస్కరించుకొని నిర్వహించిన సేవా కార్యక్రమాలు విజయవంతానికి కృషి చేసిన అందరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి హేమంత్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ ఫారెస్ట్ మూవీ బ్లాక్ బస్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వి.యస్.ఆర్ క్రియేషన్స్ పతాకంపై ప్రారంభం కానున్న సస్పెన్స్ కమర్షియల్ థ్రిల్లర్ బ్లాక్ ఫారెస్ట్ మూవీ స్క్రిప్ట్ పూజ కార్యక్రమం బుధవారం పుత్తూరు బైపాస్ రోడ్డు అంజారమ్మకణంలో నిర్వహించారు. తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష క్లాప్ కొట్టి, టీమ్ సభ్యులను, ఆర్టిస్టులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మేయర్ మాట్లాడుతూ ఈ సినిమా హిట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత వి.యస్. రెడ్డి, సినిమా దర్శకుడు అనురాగ్ శివ, లీడ్ రోల్ ఆర్టిస్టులు శ్రావణి, తన్సియా, శ్రీలీల, సందీప్ లు పాల్గొన్నారు.

అగ్రో ఫారెస్ట్రీ అభివృద్ధికి శ్రీకారం

- వెదురు, శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల పెంపకం
- రాష్ట్రవ్యాప్తంగా గ్రీనరీ శాతాన్ని పెంచుతాం
- రైతుల శిక్షణ కార్యక్రమంలో సిసిఎఫ్ సెల్వం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తిరుపతి సర్కిల్ సిసిఎఫ్ సెల్వం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్రవ్యాప్తంగా గ్రీనరీ శాతాన్ని 50 శాతం మేర పెంపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన నేపథ్యంలో తిరుపతి జిల్లా పరిధిలో అగ్రో ఫారెస్ట్రీ అభివృద్ధికి బెంగుళూరుకు చెందిన ఇన్స్ టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ విభాగం సంయుక్తంగా వెదురు, శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల పెంపకం చేసేలా నిర్ణయం తీసుకున్నామని తిరుపతి సర్కిల్ సిసిఎఫ్ సెల్వం అన్నారు. బుధవారం తిరుపతి కరకంబాడి మార్గంలోని అటవీశాఖకు చెందిన బయోట్రిమ్ లో జిల్లా ఉద్యానవన శాఖ సహకారంతో రైతులకు వెదురు, శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల పెంపకం, దాన్ని వ్యాపారం చేసుకోవడం తదితర అంశాలపై అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎఫ్ సెల్వం మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో మొదటగా ఎర్రచందనం ను వ్యవసాయదారులు పెంచుకునే విధంగా కృషి చేశామన్నారు. పచ్చదనం పెంపొందించడం కోసం ఐదు కోట్ల మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టామన్నారు. కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నరేందిరన్ మాట్లాడుతూ అటవీ సరిహద్దు గ్రామాలలో ఆహారం కోసం అన్వేషిస్తూ వచ్చే ఏనుగుల గుంపులు అడవిలో ఉన్న వెదురు చెట్లను తినేయడం, అటు తర్వాత ఆహారం లేక పంట పొలాలపైకి రావడం జరుగుతుందన్నారు. హర్యానా రాష్ట్రంలో ఎక్కువగా వుడ్ ప్రొడక్షన్ జరుగుతోందని, అడవుల శాతం తక్కువ ఉన్నా అక్కడివారు వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా కలపను వృద్ధి చేసుకొని వ్యాపారం చేసుకుని అభివృద్ధి చెందుతున్నారన్నారు. మన తిరుపతి జిల్లాల్లో కూడా అగ్రో ఫారెస్ట్రీ, ఫామ్ ఫారెస్ట్రీ అభివృద్ధి చేయడానికి శ్రీకారం చుట్టామన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరధ రామి రెడ్డి మాట్లాడుతూ ఇది ఎంతో రైతులకు మేలు చేకూర్చే కార్యక్రమం అని, రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటే ఒక హెక్టార్ కు 33 వేల రూపాయల సబ్సిడీతో వెదురు మొక్కలను అభివృద్ధి చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. లక్ష్యంగా ఇప్పటికే 12 హెక్టార్లుగా ఉందని, ఏనుగులు కూడా రుచించని తిరుపుర వెదురు రకాన్ని రైతులకు సరఫరా చేస్తామన్నారు. వచ్చే జూన్ మాసంలో 1 లక్ష వెదురు మొక్కలను బాంబు మిషన్ ద్వారా అభివృద్ధి చేయనున్నమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 70 మంది రైతులు, ఇన్స్ టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సైంటిస్టులు డాక్టర్ నరసింహమూర్తి, డాక్టర్ ఎం.వి దొరై, ఏసిఎఫ్ సోమశేఖర్, అసిస్టెంట్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ పవన్ కుమార్, ఎఫ్ఆర్వోలు లక్ష్మీపతి, లక్ష్మప్ప, అటవీశాఖ, బయోట్రిమ్ సిబ్బంది పాల్గొన్నారు.